

ఈవీ స్టేషన్లు ఏవి?

- **చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యం**
- **కేంద్రం ఆదేశాలను పెడచెవిన పెట్టిన వైనం**
- **హైదరాబాద్‌లోనే 150 స్టేషన్లు అవసరం**
- **అందుబాటులోకి వచ్చింది కేవలం 72**
- **మరో 59 ఏర్పాటుకు సాగుతున్న పనులు**
- **19 స్టేషన్లకు స్థలాలే చూడని ప్రభుత్వం**

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను వేగంగా ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశిస్తున్నా, రాష్ట్రంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలనూ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. రాష్ట్రమంతటా 750 చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి సంఖ్యను 2,000 పెంచాల్సిన అవసరం ఉన్నదని అధికారులు గుర్తించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగింది. వీటికోసం కనీసం 150 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితం రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో)ను ఆదేశించింది. ఇంతవరకు 72 మాత్రమే నిర్వహణలోకి వచ్చాయి. మరో 59 ఏర్పాటుకు పనులు సాగుతున్నట్టు అధికారులు తెలిపారు. మిగతా 19 ఏర్పాటుకు అవసరమైన స్థలాలను చూపడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నట్టు తెలిసింది.

ప్రభుత్వ స్థలాలివ్వాలన్న కేంద్రం

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల కొరతను అధిగమించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల అవరణల్లో ఖాళీ స్థలాలను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణకు ముసాయిదాను అన్ని రాష్ట్రాలకు పంపింది. ఈ మేరకు ప్రతిపాదనలపై అభ్యంతరాలను, సలహాలను పంపాలని రాష్ట్రాలకు సూచించింది. ఈవీ చార్జింగ్ స్టేషన్లకు స్థలాలు ఇవ్వడానికి నిబంధనలు, టెండర్ బిడ్డింగ్ ప్రక్రియ విధానాన్ని రూపొందించాలని సూచించింది. స్థలాలను పొందేందుకు అందరికీ అవకాశాలు కల్పించాలని, చార్జింగ్ స్టేషన్లు 24 గంటలు పనిచేసేందుకు అవసరమైన అన్నిరకాల అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి, సమస్యల పరిష్కారానికి ఒక ప్రభుత్వ సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించాలని సూచించింది.

కేంద్రాల ఏర్పాటుకు కమిటీ వేయాలి

రాష్ట్ర ఇంధనశాఖ కార్యదర్శి చైర్మన్‌గా, రవాణా, పురపాలక, ఇతర అవసరమైన విభాగాల వారితో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది. అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక, పర్యవేక్షణ బాధ్యతలు ఈ కమిటీకి అప్పగించాలని పేర్కొంటూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం లేఖలు కూడా రాసింది. కానీ ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఎన్‌వోసీ తప్పనిసరి

టీజీ రెడ్కో నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకొని ప్రైవేటు వ్యక్తులు ఎక్కడైనా రోడ్డు పక్కన స్థలం ఉంటే ఈవీ చార్జింగ్ స్టేషన్ పెట్టుకోవచ్చు. అపార్టుమెంట్లలో అందరికీ ఉపయోగపడేలా చార్జింగ్ స్టేషన్ పెట్టాలన్నా ఎన్‌వోసీ తప్పనిసరి. అది లేకుండానే హైదరాబాద్ నగరంలోని కొన్ని అపార్టుమెంట్లలో చార్జింగ్ స్టేషన్లు పెడుతున్నట్టు అధికారులు గుర్తించారు.

మోసాల్లో బ్యాంకింగ్



ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 18,461..వీటి విలువ రూ.21 వేల కోట్లు

ముంబై, డిసెంబర్ 26: బ్యాంకింగ్ మోసాలను అరికట్టడానికి కేంద్రం, రిజర్వు బ్యాంక్ చేసిన ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. రిజర్వుబ్యాంక్ తాజాగా విడుదల చేసిన ఈ నివేదిక ఈ విషయాన్ని బట్టబయలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 18,461 బ్యాంకింగ్ మోసాలు జరిగాయని తెలిపింది. వీటి విలువ రూ.21,367 కోట్లని పేర్కొంది. క్రితం ఏడాది జరిగిన మోసాలతో పోలిస్తే భారీగా పెరగగా, అదే విలువ కూడా ఎనిమిది రెట్లు పెరిగిందని ఈ నివేదికలో వెల్లడించింది. బ్యాంకింగ్ రంగ పనితీరు, కమర్షియల్ బ్యాంకులతోపాటు కో-ఆపరేటివ్ బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థల పనితీరు ఆధారంగా సెంట్రల్ బ్యాంక్ 'ట్రెండ్ అండ్ ప్రొగ్రెస్ ఆఫ్ బ్యాంకింగ్ ఇన్ ఇండియా 2023-24' పేరుతో గురువారం ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో 18,461 బ్యాంకింగ్ మోసా లు జరిగాయి. వీటి విలువ రూ.21,367 కోట్లు. క్రితం ఏడాది రూ. 2,623 కోట్ల విలువైన 14,480 బ్యాంకింగ్ మోసాలు జరిగాయి. బ్యాంకింగ్ మోసాలు ఆర్థిక వ్యవస్థకు, నిర్వహణ, వ్యాపార రిస్క్, ఆర్థిక స్థిరత్వ చిక్కులతో అనేక సవాళ్లను ఎదుర్కొవాల్సి ఉంటుందని తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ మోసాలు దశాబ్ద కనిష్ఠ స్థాయికి, వీటి విలువ కూడా 16 ఏండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయాని వెల్లడించింది. ఈ మోసాల్లో అత్యధికంగా ఇంటర్నెట్, కార్డ్ మోసాల వాటా 44.7 శాతంగా ఉన్నదని, మొత్తం విలువలో వీటి వాటా 85.3 శాతంగా ఉన్నదని పేర్కొంది.

ప్రైవేట్ బ్యాంకుల్లోనే అధికం..

ప్రభుత్వరంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో అత్యధికంగా మోసాలు జరిగాయని రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మోసాల్లో ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటా 67.1 శాతంగా నమోదైంది. కానీ, విలువ పరంగా చూస్తే ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కార్డ్, ఇంటర్నెట్ మోసాలు అధికంగా జరగడంతో వీటి విలువ అధికంగా ఉన్నది. అలాగే గతేడాది ప్రైవేట్, ప్రభుత్వరంగ బ్యాంకులపై రూ.86.1 కోట్ల మేర జరిమానా విధించారు. డిజిటల్ మోసాల్లో అనేక కేసులు కస్టమర్లపై సోషల్ ఇంజనీరింగ్ దాడుల ఫలితంగా ఉన్నప్పటికీ, అటువంటి మోసాలకు పాల్పడేందుకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించడం కూడా వేగంగా పెరుగుతున్నది.

పెరిగిన బ్యాంకుల లాభాలు

బ్యాంకుల లాభాలు మరింత పెరిగాయి. వరుసగా ఆరో ఏడాది 2023-24లోనూ బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ 13 ఏండ్ల కనిష్ఠ స్థాయి 2.7 శాతానికి పడిపోవడంతో లాభాలు అంతకంతకు పెరిగాయని ఆర్బీఐ వెల్లడించింది. ఆర్థిక మూలాలు ధృడంగా ఉండటంతోపాటు బ్యాంకుల పనితీరు మెరుగుపడటం ఇందుకు కారణమని విశ్లేషించింది. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ 32.8 శాతం ఎగబాకి రూ.3,49,6034 కోట్లకు చేరుకున్నాయి. మార్చి 2024 నాటికి దేశవ్యాప్తంగా 12 ప్రభుత్వరంగ బ్యాంకులు ఉండగా, 21 ప్రైవేట్ బ్యాంకులు, 45 విదేశీ బ్యాంకులు, 12 ఎస్ఎఫ్‌బీలు, ఆరు పేబీలు, 43 ఆర్ఆర్‌బీలు, రెండు ఎల్‌ఏబీలు ఉన్నాయి.

చిన్న షేర్లు.. పెద్ద లాభాలు

2024లో అత్యధిక లాభాలు పంచిన స్మాల్ స్టాక్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: చిన్న షేర్లు పెద్ద లాభాలు పంచాయి. ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెట్టినవారికి అత్యధిక రాబడిని పంచాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై నమ్మకం ఉండటంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎగబడి పెట్టుబడులు పెట్టడంతో సూచీలు రికార్డు స్థాయికి ఎగబాకాయి. బ్లూచిప్ సంస్థలతోపాటు చిన్న, చితక సంస్థల షేర్లు కదంతొక్కాయి. ఈ నెల 23 వరకు బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఏకంగా 12,144.15 పాయింట్లు లేదా 28.45 శాతం లాభపడింది. అలాగే మిడ్‌క్యాప్ ఇండెక్స్ కూడా 9,435.09 పాయింట్లు లేదా 25.61 శాతం ఎగబాకింది. కానీ, 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 6,299.91 పాయింట్లు లేదా 8.72 శాతం మాత్రమే పెరిగింది. ఈ నెల 12 ముగిసేనాటికి బీఎస్ఈ స్మాల్‌క్యాప్ చారిత్రక గరిష్ఠ స్థాయి 57,827.69కి చేరుకోగా, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 49,701.15కి చేరుకున్నది. ప్రాంతీయంగా ఉండే ఇన్వెస్టర్లు ఎక్కువశాతం చిన్న స్థాయి స్టాక్‌లను కొనుగోలు చేస్తుంటారు, అలాగే విదేశీ పెట్టుబడిదారులు బ్లూచిప్ సంస్థలు లేదా అతిపెద్ద సంస్థల్లో తమ పెట్టుబడులు పెడుతుంటారు. మిడ్‌క్యాప్ ఇండెక్స్ సరాసరి బ్లూచిప్ సంస్థల్లో ఐదోవంతుని, స్మాల్‌క్యాప్ సంస్థలు పదో వంతు కలిగివుండనున్నాయి. వచ్చే ఏడాదిలోనే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు ఇదే తరహాలో లాభాలు పంచే అవకాశాలున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి.

'స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు మెరుగైన ప్రదర్శనగావించాయి. ఈ రంగాలు అత్యధిక వృద్ధి నమోదు చేసుకోవడం, అనుకూల మార్గదర్శకాలు, పెట్టుబడిదారులు ఆసక్తి చూపారు. రియల్ ఎస్టేట్, మౌలికం, హెల్త్‌కేర్, రెన్యూవబుల్ ఎనర్జీ రంగ షేర్లు భారీగా పుంజుకున్నాయి.

- పాల్కా అరోరా చోప్రా,
మాస్టర్ క్యాపిటల్ సర్వీసెస్ డైరెక్టర్

జీరో డౌన్‌పేమెంట్‌తో ఎంజీ కార్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు ఆకర్షణీయమైన పథకాలను ప్రవేశపెడుతున్నాయి. పలు మాడళ్లపై రాయితీలు ప్రకటిస్తున్న సంస్థలు.. దీంట్లోభాగంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సరికొత్త ప్రణాళికను అందుబాటులోకి తీసుకొచ్చింది. కంపెనీకి చెందిన ఎంజీ ఆస్టర్, ఎంజీ హెక్టార్‌లను కొనుగోలు చేసిన వారికి జీరో డౌన్‌పేమెంట్‌తో 100 శాతం రుణాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. విడిభాగాల కోసం కూడా రూ.50 వేల వరకు నిధులు కూడా అందించనున్నది. ఈ ఆఫర్ ఈ నెల చివరి వరకు మాత్రమే.

టాటా 5 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 26: వచ్చే ఐదేండ్లలో టాటా గ్రూపునకు చెందిన సంస్థల ద్వారా 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్ర శేఖరన్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులకు రాసిన లేఖలో ఆయన ఈ విషయాలు పంచుకున్నారు. 2024లో అంతర్జాతీయంగా, భౌగోలిక రాజకీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ నిలకడైన వృద్ధిని సాధించామన్నారు.

రూపాయికి తప్పని తిప్పలు

12 పైసలు కోల్పోయి 85.27 స్థాయికి పడిపోయిన విలువ



ముంబై, డిసెంబర్ 26: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. గత కొన్నిరోజులుగా పడుతూ వచ్చిన మారకం విలువ గురువారం మరో 12 పైసలు కోల్పోయి 85.27కి జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడంతోపాటు డాలర్ బలోపేతం కావడం వల్లనే రూపాయి పై ప్రతికూల ప్రభావం చూపిందని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ నెలకొనడం, డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై సుంకాన్ని ఎత్తివేసే అవకాశలుండటం కూడా పతనాన్ని శాసించాయి. డాలర్‌తో పోలిస్తే 85.23 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఇంట్రాడేలో 85.28కి జారుకున్నది. చివరికి 12 పైసలు పతనం చెంది 85.27 వద్ద ముగిసింది. ఈవారంలో ఇప్పటి వరకు రూపాయి 13 పైసలు పతనం చెందింది. కనీస భవిష్యత్తులో డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు 85-85.45 స్థాయిలో కదలాడవచ్చునని ఫారెక్స్ డీలర్ తెలిపారు.

దిగుమతులు భారం పైకి

రూపాయి పతనంతో దిగుమతులకోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి రావచ్చునని గ్లోబల్ ట్రేడ్ రీసర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) వర్గాలు వెల్లడించాయి. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ ఇప్పటి వరకు భారీగా పతనమైందని, దీంతో 15 బిలియన్ డాలర్ల అధికంగా నిధులు వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొంది. గతేడాది డిసెంబర్‌తో పోలిస్తే రూపాయి విలువ 2.34 శాతం పతనమైందని, దీంతో విలువ రూ.83.25 నుంచి రూ.85.20 స్థాయికి పడిపోయింది.

ఒడిదొడుకుల్లో సూచీలు

తీవ్ర ఒడిదొడుకుల మధ్య ట్రేడింగైన దేశీయ స్టాక్ మార్కెట్లు ఫ్లాట్‌గా ముగిశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకోవడంతో ఒక దశలో 400 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ చివరకు స్వల్పంగా నష్టపోయి 78,472.48 వద్ద ముగియగా..నిఫ్టీ 22.55 పాయింట్లు ఎగబాకి 23,750.20 వద్ద ముగిసింది.

క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి

- **మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**
- **రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు బయల్దేరిన క్రీడాకారులు**

బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 26 : సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ నెల 27 నుంచి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు బయలుదేరుతున్న బస్సులను గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి జిల్లా యువజన క్రీడ అధికారి కీర్తి రాజ్‌వీరు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలు, మండల, మున్సిపల్, జిల్లా స్థాయిల్లో వివిధ క్రీడా పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా నుంచి 190 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడల ద్వారా క్రమ శిక్షణ అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్తదానం..ప్రాణదానంతో సమానం

- **సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్**
- **వృత్తి శిక్షణా కేంద్రంలో సింగరేణి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జీఎం దేవేందర్

మందమర్రి, డిసెంబర్ 26: రక్త దానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానమని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జీ.దేవేందర్ అన్నారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి వృత్తి శిక్షణ కేంద్రంలో సింగరేణి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో కూడా ముందుంటుందన్నారు. జిల్లాలో అనేక మంది సికిల్ సెల్, తలసేమియా వ్యాధి బాధితులు ఉన్నారని వారికి తరచుగా రక్తం అవసరం ఉంటుందని తెలిపారు. వ్యాధి బాధితుల కోసం ప్రతి నెలా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన కార్మికులు, గనులు, డిపార్ట్‌మెంట్‌లకు చెందిన ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో సమయానికి రక్తం లభించక ప్రాణాలు పోయే పరిస్థితులు కూడా ఉంటాయని ఆయన తెలిపారు. ఇప్పుడు దానం చేసే రక్తం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారితో పాటు, తలసేమియా వ్యాధి బాధితులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుల సేవలను ఆయన అభినందించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం విజయ్ ప్రసాద్, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ శంకర్, ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, సబ్ డివిజన్ సభ్యులు సూరం లక్ష్మీనారాయణ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పీవోకు టీబీజీకేఎస్ సన్మానం

బదిలీపై వెళ్తున్న సీనియర్ పీవోను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్, డిసెంబర్ 26 : శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 3గని సీనియర్ పీవోగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎండీ గౌస్‌పాషాను గనిపై గురువారం అధికారులు, నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీబీజీకేఎస్ ప్రదాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ సభ్యుడు విస్లావత్ గోప్యానాయక్, గని చీఫ్ ఆడ్వైజర్ సాధుల భాస్కర్, పిట్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఆర్పీ 3గని కార్మికులకు యాజమాన్యానికి మధ్య సమన్వయ కర్తగా సీనియర్ పీవోగా మంచి సేవలు అందించారని చెప్పారు. కొత్తగూడెం ఏరియాకు బదిలీ కావడం జరిగిందని, వెల్ఫేర్ ఆఫీసర్‌గా సంస్థలో ఎంతో క్రమ శిక్షణగా పని చేస్తూ కార్మికుల, అధికారుల మన్ననలు పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్, గోపతి మల్లేశ్, టీ శ్రీనివాస్, పవన్‌కల్యాణ్, అనిరుద్‌కుమార్, శశిధర్, అల్లం రాజయ్య పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

బోథ్, డిసెంబర్ 26 : మండలంలోని దేవుల నాయక్ తండా గ్రామ పంచాయతీలో గురువారం మూడు గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, ప్రారంభించారు. లైట్లు ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ రామ, కిషన్ నాయక్, జాదవ్ బాబులాల్, ముకుందరావ్, మెర్సింగ్ నాయక్, ఆడె రవీందర్, ఇందల్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం..

నిప్పు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఇచ్చోడ, డిసెంబర్ 26 : రామగుండం నుంచి ఇచ్చోడ ఐటీడీఏ పెట్రోల్ పంపు నకు వస్తున్న పెట్రోల్ ట్యాంకర్‌కు గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. అప్రమత్తమైన ఎస్ఐ తిరుపతి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ఆర్పివేశారు. ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కబడ్డీ టోర్నీ ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ, ప్రజాప్రతినిధులు

భీంపూర్, డిసెంబర్ 26 : భీంపూర్ మండలం బేల్సరి రాంపూర్‌లో గురువారం కబడ్డీ టోర్నీని ఎస్ఐ కలీం, మాజీ సర్పంచ్ మడావి లింబాజీ ప్రారంభించారు. తెలంగాణ, మహారాష్ట్ర జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుడిమెత సంతోష్, పాండురంగ్, మనోహర్ తదితరులున్నారు.

ఘనంగా వీర్ బాల్ దివస్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 26 : నిర్మల్ పట్టణంలోని బస్ డిపో బోయివాడ కాలనీలోని గురుద్వార్‌లో గురువారం వీర్ బాల్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఎమెల్యే మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. సిక్కుల పదో గురువైన గురుగోవింద్ సింగ్ పదో కుమారులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిక్కు మతస్థులతో పాటు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

జైనథ్, డిసెంబర్ 26 : జైనథ్ మండల కేంద్రంలోని పురాతన శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని గురువారం హైకోర్టు జడ్జి డీ రమాకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సన్మానించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేశ్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఎదులాపురం, డిసెంబర్ 26 : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జనవరి 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి లంకా రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సీపీఎం ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూసం సచిన్, ఏరియా కమిటీ సభ్యులు ఎన్ స్వామి, గంగన్న, ఆత్రం కిష్టన్న, పోచక్క, వెంకన్న, గంగారాం, ఆశన్న పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 26 : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లాలో 28, 29, 30 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆరో విద్యా, వైజ్ఞానిక మహాసభ పోస్టర్లను నిర్మల్‌లో గురువారం అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ ఆవిష్కరించారు. ఈ సదస్సుకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించిందని, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

విలీన సభను..

ఎదులాపురం,డిసెంబర్ 26 : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 28న జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. కుమ్రం భీం భవన్‌లో గురువారం సంబంధిత వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్ శేషరావు, అఖిల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎర్రాజి హరీశ్, జిల్లా సహాయ కార్యదర్శి కనక దత్తు, పీవైఎల్ జిల్లా నాయకులు సుంగు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడెం, డిసెంబర్ 26 : కడెం మండలకేంద్రంలోని 30 పడకల దవాఖానలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఎమ్మెల్యే బొజ్జుకు విన్నవించారు. డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ మాట్లాడారు. వైద్యాధికారి రెగ్యులర్‌గా రావడం లేదని, ప్రజలకు అధికారుల అందుబాటులో లేక ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, నాయకులు, తదితరులున్నారు.

మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలి

శ